క్లుప్తంగా

అభిజిత్ కంపెనీని తక్షణం తెరిపించాలి



ఆందోళన చేస్తున్న కార్మికులు

అచ్యుతాపురం(మునగపాక): మూసివేసిన అభిజిత్ కంపెనీని తక్షణమే తెరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలోని అభిజిత్ కంపెనీ ముందు శనివారం కార్మికులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 రోజులుగా కంపెనీ కార్మికులు ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులతో ఎటువంటి సంప్రదింపులు లేకుండా కంపెనీ లే–ఆఫ్ ప్రకటించడం చట్ట విరుద్ధమన్నారు. కంపెనీ మూసేయడం వల్ల ఉద్యోగులు, కార్మికులు వీధిన పడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక శాఖ అధికారులు స్పందించి తక్షణమే కంపెనీ తెరిపించేలా చూడాలన్నారు. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

హరిపాలెం పీహెచ్‌సీలో 'స్వచ్ఛతా హీ సేవా'



ఆరోగ్య కేంద్రం ఆవరణను శుభ్రం చేస్తున్న ఉద్యోగులు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఉద్యోగులు, సిబ్బంది స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి సూరిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ప్రాంగణంలో పేరుకుపోయిన తుప్పలు, పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిశుభ్రతపై దృష్టి సారించాలని శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆశా నోడల్ అధికారి సునీత, ఆరోగ్య పర్యవేక్షకులు ఉమామహేష్, సిబ్బంది గణేష్, నాగేశ్వరరావు, ఏఎన్‌ఎంలు, ఆశ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



వాడ్రాపల్లిలో పరిసరాలను శుభ్రం చేస్తున్న గ్రామ పెద్దలు

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని డీఎల్‌డీవో మంజులావాణి సూచించారు. మండలంలోని వాడ్రాపల్లి, తిమ్మరాజుపేట, మునగపాక గ్రామాల్లో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శనివారం గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టాలన్నారు. తద్వారా గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయన్నారు. పారిశుధ్యం మెరుగునకు పాటుపడాలని కోరారు. గ్రామాలు స్వచ్ఛంగా ఉన్ననాడే ఎటువంటి రోగాలకు అవకాశం ఉండదని చెప్పారు. కార్యక్రమంలో వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, శేషు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామభక్తి చాటుకున్న అనంతరావుకు సత్కారం



మళ్ల అనంతరావును సత్కరిస్తున్న గ్రామస్తులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో రామభక్తి చాటుకున్న మళ్ల అనంతరావును శనివారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. రామకోటి రాసిన 100 పుస్తకాలను ఉదయం 7 గంటల నుంచి పల్లకీలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. హిందూ పరిరక్షణ సమితి కన్వీనర్ వాసు, రామ ప్రభు, ఈశ్వరరావు, సూర్యప్రభ, నూకరత్నం, మాణిక్యం తదితరులు కార్యక్రమంలో పాల్గొని 8 ఏళ్లుగా రామకోటి రాసిన అనంతరావును అభినందించారు.

సమస్యల సుడిలో.. రాంబిల్లి పీహెచ్‌సీ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వాస్పత్రులు అభివృద్ధి పథంలో నడిచాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధిని పట్టించుకునే వారు కరవయ్యారు. గత ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీలకు ఎంపీపీతో కూడిన అభివృద్ధి కమిటీలు వేసి ప్రత్యేకంగా నిధులు కేటాయించి ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. ప్రభుత్వం మారిన వెంటనే పీహెచ్‌సీలపై సరైన పర్యవేక్షణ లేకుండా పోయింది. అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు పటించుకోక పీహెచ్‌సీలను నిర్లక్ష్యం వెంటాడుతోంది.



రాంబిల్లి పీహెచ్‌సీ నూతన భవనం

- తుప్పలు, పిచ్చిమొక్కల నడుమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- వైద్యం కోసం వెళ్లేందుకు భయపడుతున్న రోగులు
- పాముల బెడద.. సిబ్బంది కొరత



తుప్పల మధ్య పాత పీహెచ్‌సీ భవనం



పీహెచ్‌సీ ఆవరణలో పెరిగిపోయిన తుప్పలు

రాంబిల్లి (యలమంచిలి): పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న రాంబిల్లి మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఉంది. ఇక్కడ నేవీ ప్రాజెక్ట్ రావడంతో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు అధిక శాతం మంది వచ్చి పని చేస్తున్నారు. అలాగే తీర ప్రాంతానికి దగ్గరలో ఉన్న వాడనర్సాపురం, కొత్తపట్నం, గోవిందపాలెం, రాంబిల్లి, వాడపాలెం, పెదకలవలాపల్లి, వైలోవ, చిన కలవలాపల్లి, కొప్పుగొండుపాలెం, కొత్తపేట, జెడ్ చింతువా, గజరెడ్డిపాలెం, వెంకయ్యపాలెం తదితర గ్రామాల నుండి రాంబిల్లి మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీకి వచ్చి వైద్య సేవలు పొందుతారు. నిత్యం వందలాది మంది రోగులు రాంబిల్లి పీహెచ్‌సీకి వస్తుంటారు. అయితే ఇక్కడ పాత పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త భవనం నిర్మించి దానిలో వైద్యసేవలు అందిస్తున్నారు. కానీ రోగుల తాకిడి వల్ల కొత్త భవనం ఒక్కటీ చాలక పాత భవనాన్ని కూడా వాడుతున్నారు. అయితే ఇక్కడున్న పాత భవనం చుట్టు తుప్పలు పెరిగిపోయి పాములు, ఎలుకలు, దోమలకు ఆవాసంగా మారిపోయింది. రోగాల బారిన పడిన ప్రజలు పీహెచ్‌సీకి రావాలంటే భయపడుతున్నారు. ఇక్కడి నేవీ ప్రాజెక్టులో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వారిని మెరుగైన వైద్య సేవల కోసం రాంబిల్లి పీహెచ్‌సీకి తరలించాలన్నా లేదా అత్యవసర పరిస్థితుల్లో అనకాపల్లి, యలమంచిలి, విశాఖపట్నం పెద్దాస్పత్రులకు తరలించాలన్నా 108 కానీ ప్రభుత్వ అంబులెన్స్ కాని లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే పీహెచ్‌సీలో సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఆస్పత్రిలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలు వెచ్చించి అదనపు భవన నిర్మాణం చేపట్టింది. భవన నిర్మాణ పనులు పూర్తి అయినా ప్రారంభానికి నోచుకోలేదు. అదనపు భవనం ప్రారంభిస్తే ఆస్పత్రిలో వసతి సమస్య తీరుతుందని ప్రజలు కోరుతున్నారు.

రాంబిల్లి పీహెచ్‌సీలో ప్రధాన సమస్యలు

- రాంబిల్లి మండలానికి 108, ఆస్పత్రికి అంబులెన్స్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- ఆస్పత్రి ఆవరణలో తాగునీటి బోరు లేకపోవడంతో పంచాయతీ కుళాయి ద్వారా నీరు వస్తున్నా రోగులకు సరిపోవడం లేదు.
- ఆస్పత్రిలో వాచ్‌మేన్, సిబ్బంది కొరత వేధిస్తోంది.
- ఆస్పత్రిలో 24 గంటలు వైద్య సేవలందించాలి.
- అన్ని రకాల వ్యాధులకు మందులు దొరకటం లేదు.
- జనాభా ప్రాతిపదికన రాంబిల్లి పీహెచ్‌సీలో బెడ్‌లు పెంచాలి.
- అత్యవసర విభాగం సేవలు ప్రజలకు అందడం లేదు.
- ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు ఆగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
- గ్రామాల్లో జ్వర నియంత్రణ పరీక్షలు సరిగ్గా అమలు కావడం లేదు.

అంబులెన్స్ కేటాయించాలి



రాంబిల్లి మండలానికి 108, పీహెచ్‌సీకి అంబులెన్స్‌ను ప్రభుత్వం కేటాయించాలి. ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర వైద్యం కోసం రోగులను తరలించడానికి 108 అంబులెన్స్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను తరలించేందుకు అంబులెన్స్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– కిల్లాడి అప్పలరాజు, గోవిందపాలెం

ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేయాలి



రాంబిల్లి మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీని మరింత అభివృద్ధి చేయాలి. అలాగే ఆస్పత్రి వద్ద తుప్పలు తొలగించాలి. ఆస్పత్రిని అభివృద్ధి చేసి అత్యవసర వైద్యసేవలు అందేలా, ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి. అన్ని రకాల రోగాలకు మందులు అందించాలి. తగినంత మంది సిబ్బందిని నియమించాలి.

– జోగా బుజ్జి, గోవిందపాలెం

ఆస్పత్రి ఆవరణలో తుప్పలు తొలగిస్తాం

రాంబిల్లి పీహెచ్‌సీ ఆవరణలో తుప్పలు పెరిగిపోవడం వాస్తవమే. వాటిని తొలగించడానికి పంచాయతీ అధికారులకు తెలియపరిచాం. పీహెచ్‌సీలో వాచ్‌మేన్ లేకపోవడంతో తుప్పలు తొలగించడానికి వీలు కాలేదు. అలాగే పీహెచ్‌సీలో సిబ్బంది కొరత కొంతమేర ఉండటంతో ఇబ్బంది పడుతున్నాం. ఆస్పత్రికి రోజుకు వంద మంది వరకు రోగులు వస్తూ ఉంటారు. అందరికీ అందుబాటులో ఉండి వైద్య సేవలందిస్తాం.

– అనిల్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాంబిల్లి,

ఆయిల్‌పామ్ తోటల్లో అంతరపంటల సాగు శ్రేయస్కరం



రైతులను సూచనలిస్తున్న చంద్రశేఖర్

మునగపాక: ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటల సాగు శ్రేయస్కరమని జిల్లా పతంజలి ఆయిల్‌పామ్ మేనేజర్ టి.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని తోటాడ పాల కేంద్రంలో ఉద్యానవన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి రైతులకు ప్రభుత్వం రాయితీలు అందజేస్తుందన్నారు. ఈ పంట లాభదాయకంగా ఉంటుందని, మొక్క నాటిన నుంచి చేతికి అందివచ్చేంత వరకు సస్యరక్షణ చేయాల్సి ఉంటుందని చెప్పారు. అసిస్టెంట్ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్‌లో అధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా ఆశించిన ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి అజయ్, మండల ఫీల్డ్ సూపర్‌వైజర్ ఆడారి సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

శ్రీదేవితల్లి గుడి నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న సతీష్‌కుమార్

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదేవితల్లి అమ్మవారికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. పలువురు దాతలు ముందుకొచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యమవుతున్నారు. శనివారం ఇదే గ్రామానికి చెందిన పల్లె సత్యనారాయణ(లేటు)–అమ్మన్నమ్మ దంపతుల ద్వితీయ కుమారుడు సతీష్‌కుమార్ రూ.25 వేల విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ పల్లె అప్పలనాయుడుకు అందజేశారు. దీంతో కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



స్వచ్ఛతా హీ సేవలో పాల్గొన్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ తదితరులు

కోటవురట్ల: పరిశుభ్రతతోనే ఆరోగ్యమని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ అన్నారు. మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ అధికారులతో పాటు రహదారుల్లోని ప్లాస్టిక్ కవర్లు ఏరి చైతన్యం కలిగించారు. మన ఇంటితో పాటు ఊరిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్న భావన ప్రతి ఒక్కరిలో కలగాలన్నారు. రహదారుల్లో చెత్త, ప్లాస్టిక్ కవర్లు ఇష్టానుసారంగా వేయకుండా బాధ్యతగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, పీఆర్ జేఈ వర్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తుప్పలు తొలగించండి



రామన్నపాలెం శివారులో పిచ్చిమొక్కలు

కోటవురట్ల: గ్రామీణ రహదారులు అధ్వాన స్థితిలో ఉన్నాయి. ప్రధానంగా విపరీతంగా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఏ ఊరెళ్లినా పిచ్చిమొక్కలే దర్శనమిస్తున్నారు. రహదారులను కమ్మేస్తూ వాహన చోదకులకు సవాల్ విసురుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి రోడ్డుపైకి వాలిపోవడంతో ఎదుట వచ్చే వాహనాలు కనిపించడం లేదు. నీలిగుంట, రామన్నపాలెం, చినబొడ్డేపల్లి, బీమిరెడ్డిపాలెం గ్రామాలకు వెళ్లే ప్రధాన ఆర్ అండ్ బీ రహదారులు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. అధికారులు స్పందించి తుప్పల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వీధుల్లో చెత్త తొలగింపు



దేవవరంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రజా ప్రతినిధులు

నక్కపల్లి: గ్రామాల్లో పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. శనివారం దేవవరం, ఉపమాక గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. వీధుల్లో చెత్త తొలగించారు. ఈ సందర్భంగా కాలువల్లో నెలల తరబడి తొలగించని మురుగు తొలగించి శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యత అని ఎంపీడీవో అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొర్లరాఘవకుమారి, మాజీ ఎంపీటీసీ సభ్యులు గొర్ల నర్సింహమూర్తి, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి, కొరిమి సూర్యగణేష్, కొప్పిశెట్టి వెంకటేష్, కొప్పిశెట్టి బుజ్జి, బత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు.

అయోడైజ్డ్ ఉప్పునే విక్రయించాలి



షాపు యజమానులతో మాట్లాడుతున్న ఫుడ్ సేఫ్టీ అధికారి రవికుమార్

కోటవురట్ల: ప్రతి దుకాణంలో అయోడైజ్డ్ ఉప్పునే విక్రయించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రవికుమార్ తెలిపారు. ఆయన శనివారం కోటవురట్ల మండల కేంద్రంలో దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. దుకాణాల్లో నాన్ అయోడైజ్డ్ ఉప్పు అమ్మకాలు చేయరాదని, ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వారం రోజుల పాటు వీటిపై షాపు యమానులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అయోడిన్ లోపం వల్ల చిన్నారులకు బుద్ధి మాంద్యం, మహిళల్లో గర్భస్రావం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో షాపు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊరేగింపు



గౌరీపరమేశ్వరులను ఊరేగిస్తున్న గ్రామస్తులు

మునగపాక: మండలంలోని మూలపేటలో శనివారం రాత్రి గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాల నడుమ గౌరీపరమేశ్వరులను ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మునగపాక పీఎస్‌ను సందర్శించిన సీఐ

మునగపాక: పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ రికార్డులు పూర్తి చేయాలని యలమంచిలి సీఐ ధనుంజయరావు సూచించారు. శనివారం ఆయన మునగపాక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలించిన ఆయన పెండింగ్ రికార్డులపై దృష్టి సారించాలని ఎస్‌ఐ ప్రసాదరావును ఆదేశించారు. అనంతరం రెండు కేసులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఉపాధి హామీ ద్వారా గ్రామాల అభివృద్ధి



టి.సిరసపల్లిలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

మునగపాక: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి కోరారు. ఈ పథకం ద్వారా సిరసపల్లిలో శ్మశానవాటికకు వెళ్లేందుకు అనువుగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు శనివారం ఆమె కూటమి నేతలతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, మాజీ ఎంపీటీసీ యల్లపు నాగేశ్వరరావు, దొరమ్మనాయుడు, గణేష్, పాలమరశెట్టి నవీన్, పాలమరశెట్టి బాలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ బాగు చేయండి



ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని అధికారిని కోరుతున్న రైతులు

మునగపాక: మునగపాక ఇందిరమ్మ కాలనీ దరి మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని రైతు సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్ కోరారు. కొద్ది రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. బెల్లం తయారు చేసే రైతులతోపాటు పశువులకు తాగునీటి ఇబ్బందులు తప్పలేదన్నారు. రైతులకు న్యాయం చేయకుంటే కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి శనివారం తీసుకురాగా సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులు పెంటకోట శ్రీనివాసరావు, సూరిబాబు,వెలగా బుజ్జి తదితరులు అధికారులను కలిసిన వారిలో ఉన్నారు.

డ్వాక్రా మహిళల చేయూత



మాణిక్యం కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న లక్ష్మీధరణి గ్రూప్ సభ్యులు

మునగపాక: డ్వాక్రా మహిళల్లో మానవత్వం వెల్లివిరిసింది. డ్వాక్రా సంఘ సభ్యులు బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడం, వాటిని సకాలంలో చెల్లించడం వారికి తెలుసు. అయితే తోటి గ్రూప్ సభ్యురాలు ఇటీవల మృతిచెందడంతో ఆమె కుటుంబానికి చేయూత ఇచ్చేందుకు పలువురు సభ్యులు ముందుకొచ్చారు. టి.సిరసపల్లికి చెందిన బొడ్డేడ మాణిక్యం ఇటీవల పాముకాటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె లక్ష్మీధరణి గ్రూప్‌లో సభ్యురాలిగా ఉండేది. పిల్లలకు తల్లి మాణిక్యం తప్ప ఎవరూ లేకపోవడంతో సంఘ సభ్యులు శనివారం రూ.4,216 నగదును ఆమె కుమారుడు దీపక్‌కు అందజేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



టేకేటి దేముడు

మునగపాక: మండలంలోని నాగులాపల్లికి చెందిన వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. వివరాలిలా.. నాగులాపల్లికి చెందిన టేకేటి దేముడు బోరింగ్ పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ నెల 15న ఇదే గ్రామానికి చెందిన తొట్ట నారాయణ, మర్ర శివ, దంపంగి నాయుడుతో కలిసి శ్రీకాకుళం జిల్లా నౌపాడకు వెళ్లాడు. మూడు రోజులైనా దేముడు నుంచి ఫోన్ రాకపోయే సరికి కంగారు పడి బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించలేదు. దేముడు పనిచేసే యజమాని శ్రీనివాసరావుకు అతడి భార్య మేరీ ఫోన్ చేయగా దేముడు అనకాపల్లి ట్రైన్ ఎక్కి విశాఖలో దిగిపోయాడని సమాధానం చెప్పాడు. దేముడుతో కలిసి పనికి వెళ్లిన వారిని కూడా వాకబు చేయగా వారి నుంచి ఇదే సమాధానం రావడంతో ఈ నెల 25న కేసు నమోదు చేశారు. మేరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రంగా పట్టణం

- మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు



సైతారుపేట రోడ్డులో తుప్పలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

యలమంచిలి రూరల్: పర్యావరణం, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని యలమంచిలి మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు అన్నారు. పరిశుభ్రమైన పట్టణంగా యలమంచిలిని తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. శనివారం పట్టణ పరిధిలోని సైతారుపేట రోడ్డు నుంచి పెంజెరువు ప్రాంతం వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆ ప్రాంతంలో చెత్తాచెదారం, తుప్పలను తొలగించారు. పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. వారాంతంలో మున్సిపాలిటీ పరిధిలోని ఒక ప్రాంతాన్ని శుభ్రపరిచే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్టు కమిషనర్ తెలిపారు. పట్టణంలో ఎవరూ బహిరంగ మలవిసర్జన చేయరాదని సూచించారు. ప్రజలంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ సభ్యులు సీర సాయి ప్రసన్న, చిరంజీవి, కొటారు నాగమణి, కొండబాబు, పీల కనకమణి, త్రినాథరావు, మజ్జి రామకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, టీపీవో శ్రీలక్ష్మి, ఏఈ గణపతి సుబ్బారావు, మేనేజర్ విజయ్‌కుమార్, పురపాలక సంఘం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సభకు 202 అర్జీలు



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

యలమంచిలి రూరల్: మండలంలోని రేగుపాలెంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో వివిధ రకాల భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి మొత్తం 202 అర్జీలు అందాయని తహసీల్దార్ కె.వరహాలు తెలిపారు. ఈ గ్రామ సభను జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ మనీషా త్రిపాఠి తనిఖీ చేశారు. అర్జీలు ఇవ్వడానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. గ్రామాల్లో రైతులకు ఎటువంటి భూ సమస్యలు లేకుండా పరిష్కరించాలనే ధ్యేయంతో ప్రభుత్వం రెవెన్యూ సభలను నిర్వహిస్తోందని, వీటిని ఉపయోగించుకుని భూసమస్యలు పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధి ఎర్రవరంలో భూముల సరిహద్దుకు సంబంధించిన సర్వేను తనిఖీ చేసి, రెవెన్యూ రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ కె.వరహాలు, డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్, సర్వేయర్, వీఆర్వోలు, గ్రామ రెవెన్యూ సహాయకులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో వమ్మవరం, గెడ్డపాలెం గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలన్నారు.